RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 02.04.2026 సంపుటి : 03 సంచిక : 117 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thursday 02.04.2026 Volume: 03 Issue 117 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

### అమరావతి చట్టబద్ధత బిల్లుకు

## లోక్‌సభ ఆమోదం

### నేడు రాజ్యసభ ముందుకు బిల్లు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమ రావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నా రు. అమరావతి బిల్లు నేడు (గురువారం ) రాజ్యసభ ముం దుకు రానుంది. బుధవారం ఉదయం అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు.

## తెలంగాణ ఖజానాకు

ఆదాయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. శాఖ చరిత్రలోనే తొలిసారిగా ఆదాయం రూ.44,000 కోట్ల మార్కు దాటింది.

# రికార్డ్ కిక్కు

### తొలిసారిగా 44 వేల కోట్లు దాటిన ఎక్సైజ్ శాఖ ఆదాయం

- 2025-26లో రూ.40,209 కోట్ల మద్యం అమ్మకాలు
- తగ్గిన బీరు సేల్స్.. పెరిగిన లిక్కర్ ఘాటు
- డిసెంబరులో అత్యధికంగా రూ.5,051 కోట్ల విక్రయాలు



**రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ ఆదాయం 2025-26 సంవత్సరంలో రూ.40,209 కోట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలిసారిగా రూ. 40 వేల కోట్ల ఆదాయానికి చేరుకోవడం రికార్డుగా చెప్పుకోవచ్చు. 2018-19 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్‌శాఖకు రూ.20,859 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయం ఏడు సంవత్సరాల్లో 2025‘26 నాటికి రూ. 40.209 కోట్లకు చేరుకుంది. 2024-25 అర్థిక సంవత్సరంలో రూ.37,487 కోట్ల ఆదాయం మద్యం అమ్మకాల ద్వారా రాగా, 2025-26లో గత సంవత్సరంతో పోలిస్తే రూ.2722 కోట్ల మద్యం అమ్మకాలు అదనంగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7 శాతంగా మద్యం అమ్మకాలు పెరిగాయి.**

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ ఆదాయం 2025-26 సంవత్సరంలో రూ.40,209 కోట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలిసారిగా రూ. 40 వేల కోట్ల ఆదాయానికి చేరుకోవడం రికార్డుగా చెప్పుకోవచ్చు. 2018-19 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్‌శాఖకు రూ.20,859 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయం ఏడు సంవత్సరాల్లో 2025‘26 నాటికి రూ. 40.209 కోట్లకు చేరుకుంది. 2024-25 అర్థిక సంవత్సరంలో రూ.37,487 కోట్ల ఆదాయం మద్యం అమ్మకాల ద్వారా రాగా, 2025-26లో గత సంవత్సరంతో పోలిస్తే రూ.2722 కోట్ల మద్యం అమ్మకాలు అదనంగా పెరిగాయి.గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7 శాతంగా మద్యం అమ్మకాలు పెరిగాయి. 2025-26 అర్థిక సంవత్సరంలో 382.91లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి.2025-26 అర్థిక సంవత్సరంలో 2 శాతం లిక్కర్ సెల్స్ పెరుగగా, బీరు అమ్మకాలు 9 శాతంగా తగ్గాయి. 2024-25 అర్థిక సంవత్సరంలో 372.25 లక్షల కేసుల లిక్కర్, 536.13 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరం తో పోలిస్తే బీరు అమ్మకాలు తగ్గాయి, లిక్కర్ అమ్మకాలు కొద్దిపాటిగా పెరిగాయి. 2025-26 అర్థిక సంవత్సరంలో నెలవారీగా మద్యం అమ్మకాలు ఎలా ఉన్నాయి. ఏప్రిల్‌లో రూ.3272 కోట్లు, మేలో రూ.3561 కోట్లు, జూన్‌లో రూ. 3273, జూలైలో రూ.3320 కోట్లు, ఆగస్టులో రూ. 3082 కోట్లు సెప్టెంబరులో రూ.3048 కోట్లు, ఆక్టోబర్‌లో రూ.2709 కోట్లు నవంబర్‌లో రూ.2868 కోట్లు , డిసెంబరులో రూ.5,051 కోట్లు, 2026 జనవరిలో రూ.3325 కోట్లు, ఫిబ్రవరి రూ.3208 కోట్లు, మార్చి 31 రూ.3486 కోట్లు మొత్తంగా రూ. 40,209 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.ఎక్సైజ్‌శాఖకు 2620 ఏ -4 మద్యం షాపుల ద్వారా సంవత్సరానికి రెంటల్ ఫీజ్ ద్వారా రూ. 1771 కోట్ల ఆదాయం సమకూరింది. 1214 బార్ల ద్వారా రూ. 549 కోట్ల ఆదాయం వస్తుంది. 2025-26 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖకు 95,628 దరఖాస్తుల ద్వారా రూ. 2869 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది.

## అమరావతి పేరుతో దోపిడీకి చంద్రబాబు ప్లాన్

### ఏపీ రాజధాని అమరావతి విషయంలో వ్యతిరేకం కాదు :ఏపీ మాజీ వైఎస్ జగన్



**అమరావతి :** ఏపీ రాజధాని అమరావతి విషయంలో తాము వ్యతిరేకం కాదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అమరావతి పేరిట దోపిడీ చేయడానికి చంద్రబాబు ఎత్తుగడలు వేశారని ఆరోపించారు. బుధవారం తాడేపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.రాజధాని అమరావతి నిర్మాణానికి లక్ష ఎకరాలు సేకరిస్తున్నారని, నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు అవసరముం టుందని ఇది ఆచరణలో సాధ్యం కాని పని అని విమర్శించారు. అంత ఖర్చును రాష్ట్రం భరించగలదా ఆలోచించాలని, ఆ భారం ప్రజలపై పడవద్దనే అభ్యంతరం చేశామని పేర్కొన్నారు.రాజధాని విషయంలో సూచిం చిన ప్లాన్ బీ మావిగన్ ( మచిలీపట్నం, విజయవాడ, గుంటూర్) మధ్యన రాజధాని అనుకూలమని, అందుకు కావాలసిన నేషనల్ హైవే కూడా ఉందని ప్రభుత్వానికి సూచించామని తెలిపారు. అయితే ఈ ప్రతిపాదన చంద్రబాబుకు నచ్చలేదని అన్నారు.రాజధాని అభివృద్ధి అసాధ్యమని తెలసి కూడా తన స్కాంల కోసం, తన బినామీల భూముల రేట్ల కోసం అమరావతి రాజధాని చేస్తున్నాడని ఆరోపించారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల నిర్ణయంలో స్వార్థం లేదని, సంకుచిత్వం అంతకంటే లేదని వెల్లడించారు.

### అమరావతి

## ఇక అజేయం..అజరామరం

### ఏపీ సీఎం చంద్రబాబు



**అమరావతి :** ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, అమరావతి ఇక అజేయం ..అజరామరమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తు పై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని అన్నారు.రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయి. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని, సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు. లోక్ సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఢిల్లీ బోణీ.. లక్నోపై ఘన విజయం

### సమీర్ అజేయ అర్థ సెంచరీతో విజృంభణ

### రాణించిన ఎంగ్డీ,నటరాజన్



**లక్నో :** ఐపీఎల్‌లో ఢిల్లీ బోణీ కొట్టింది. బుధవారం లక్నోతో జరిగిన పోరులో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 142 పరు గుల లక్ష్యాన్ని ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. సమీర్ రిజ్వి(47 బంతుల్లో 70 నాటౌట్, 5ఫోర్లు, 4సిక్స్‌లు) అజేయ అర్థసెంచరీతో అదరగొట్టగా, స్టబ్స్(32 బంతుల్లో 39 నాటౌట్) సాధి కారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ప్రిన్స్ యాదవ్ (2/20) రెండు వికెట్లు తీశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో.. క్యాపిటల్స్ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 రన్స్‌కే కుప్పకూలింది. అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (28 బంతుల్లో 35, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మిన హా మిగిలినవారంతా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి (3/27), నటరాజన్ (3/29) తలా మూడు వికెట్లు పడగొట్టగా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/31) రెండు వికెట్లు తీశాడు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. కఠిన చర్యలు

**కేంద్రం వెల్లడి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 01:** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిట కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకువస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్టపరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది.ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనల తోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.



## నాటో కూటమి నుంచి వైదొలుగుతాం

### బ్రిటన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. హర్మూజ్ జలసంధిలో అడ్డంకులు తొలగించడం కోసం ఇరా న్‌తో యుద్ధానికి కలిసి రావాలని యూరప్ దేశాలకి ట్రంప్ పిలుపునిచ్చినా.. అందుకు యూరప్ కంట్రీస్ నిరాకరించాయి. తాజాగా యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లా డుతూ.. అది తమ యుద్ధం కాదని, ఆ యుద్ధంలోకి తాము దిగబోమని చెప్పారు. అయితే హర్మూజ్ జలసంధి గుండా అనుమతి కోసం తగిన కార్యచరణతో ముందు కు వెళ్తామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నాటో కూట మి నుంచి తాము వైదొలుగుతామని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపా రు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన ‘ది టెలిగ్రాఫ్’ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆ కూటమి ఓ కాగితపు పులి వంటిదని విమర్శించారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేం దుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో నాటో దేశాలపై తీవ్రస్థాయిలో మండిపడుతున్న ట్రంప్.. వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల కూడా విమర్శించారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

•95 గ్రా. బంగారం, స్కూటర్, 2 సెల్ ఫోన్లు స్వాధీనం
•వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**జనోదయ, వరంగల్ క్రైమ్, ఏప్రిల్ 1:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరి నిందితులను వరంగల్ సిసిఎస్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు 15 లక్షల 20 వేల రూపాయల విలువగల 95గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ఒక ద్వి చక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణ సుందరం, సెల్వరాజ్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలు తెలుపుతూ.. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన కళ్యాణ సుందరం పూల వ్యాపారం నిర్వహించుకుంటూ, వచ్చిన ఆదాయంతో జల్సాలు చేయడంతో పాటు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసగా మారడం అలాగే గంజాయి విక్రయాలకు పాల్పడేవాడు. ఇదే సమయంలో మరో నిందితుడు సెల్వరాజ్‌తో పరిచయం అయింది. సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఇరువురి నిందితులు, ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలలో బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఇద్దరు నిందితులు చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడేందుకు గత నెల వరంగల్ నగరానికి చేరుకున్నారు. అనుకున్న ప్రకారం నిందితులు ఇద్దరు కలిసి ముందుగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానిపై ప్రయాణిస్తూ ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, హన్మకొండ, కెయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ మూడవ పట్టణంతో కలుపుకొని మొత్తం ఐదు చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడ్డారు.

**టెక్నాలజీతో దొరికిన నిందితులు..**

ఈ చోరీలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో పోలీసులకు అందుబాటులో ఉన్న టెక్నాలజీ వినియోగించుకొని, నిందితులను గుర్తించడం జరిగింది. వీరి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, నిందితులు మరోమారు మంగళవారం మళ్ళీ చైన్ స్నాచింగ్ లు చేయడానికి మళ్ళీ వరంగల్ వచ్చి మట్టెవాడలో దొంగిలించిన మోటార్ సైకిల్ పై హన్మకొండ బస్ స్టాండ్ నుండి పబ్లిక్ గార్డెన్ వైపు వస్తున్న క్రమంలో అనుమానంతో ఆపే క్రమంలో పారిపోతుండగా పట్టుకొని వారి నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ క్రైమ్ డీసీపీ జి.బాలస్వామి, క్రైమ్ ఏసీపీ పి సదయ్య, హన్మకొండ ఏసీపీ పి.నర్సింహరావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు ఏ. రాఘవేందర్, కె . రామకృష్ణ, హన్మకొండ ఇన్స్పెక్టర్ శివకుమార్, సుబేదారి ఇన్స్పెక్టర్ రంజిత్, ఎస్సై, కానిస్టేబుల్‌లను సీపీ అభినందించారు.

**మరో ఇద్దరు దొంగలు అరెస్ట్...**

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బింగి రఘు, మహమ్మద్ అసద్ కొత్తూరు జెండా, బోక్కల గడ్డకు చెందినవారుగా గుర్తించారు. నిందితులిద్దరూ గంజాయి, మద్యానికి బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలని తాళం వేసిన ఇళ్లలో చోరీలకు సిద్ధపడ్డారు. కొత్తూరు, కుమార్‌పెల్లి, శ్రీనగర్ కాలనీలలో బంగారు నగలు, వెండి వస్తువులు తదితర వస్తువులను దొంగిలించారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి వారిని హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. ప్రాపర్టీని రికవరీ చేసుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటా సీపీఐ

**-వరంగల్ లో ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**




**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**

ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని ప్రధానంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి చేపడుతున్నామన్నారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సాధకబాధకాలను స్వయంగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ముఖ్యంగా పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాలు, గుడిసె వాసులకు పట్టాలు, రేషన్ కార్డులు, పెన్షన్ లు, సాగునీరు వంటి స్థానిక సమస్యలపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో ఆలస్యం జరుగుచున్నదని అన్నారు. దీంతో ప్రజలు హామీల అమలుపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వలీవుల్లా ఖాద్రి, నాయకులు గుండె బద్రి, బుస్స రవీందర్, గన్నారపు రమేష్, జన్ను రవి, ల్యాదెళ్ల శరత్, తాళ్లపల్లి రాహేల, కండె నర్సయ్య, టి జాన్ పాల్, పరికరాల రమేష్, మస్కె సుధీర్, సంద్ర కుమార్, మనోహర్, శ్వేత, చిలువేరు విజయ, సారంగం, చిరంజీవి పాల్గొన్నారు.



## అర్హులకు సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**జనోదయ,హనుమకొండ, ఏప్రిల్ 1:**

అర్హులైన ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ లో కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్,జక్కుల రవీందర్ యాదవ్ హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేదుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రన్ ఫర్ జీసస్‌ను విజయవంతం చేయాలి

**ఎం సి పి ఎఫ్ ప్రెసిడెంట్ ఐతు డేవిడ్**




**జనోదయ, మంథని:**

ఈనెల 4న శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు నుండి శ్రీ పాదచౌకు అంబేద్కర్ విగ్రహం మీదుగా బస్ డిపో నుండి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల మీదుగా ఎస్ బి ఐ బ్యాంకు నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం విజయవం తం చేయాలని ఎం సి పి ఎఫ్ ప్రెసిడెంట్ అయితు డేవిడ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనంతరం బేతేల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్ ఎరుకల గూడెం ఆవరణంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. ఈ హెల్త్ క్యాంపులో మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మంథని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని మంథని నియోజకవర్గ పాస్టర్స్ సహవాస అధ్యక్షులు ఐతు డేవిడ్ తెలిపారు.

**బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతికి**

## ముదిరాజ్ కులస్థుల ఆత్మీయ సన్మానం



**జనోదయ, మంథని:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సింహం గుర్తు మీద పోటీ చేసి పెద్దపల్లి జిల్లాలోనే రికార్డ్ స్థాయిలో అత్యంత భారీ మెజారిటీ గెలుపొందిన పోతరవేని శ్రీలతక్రాంతిని మంగళవారం బోయిన్ పేట్‌కు చెందిన ముదిరాజ్ కులస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం పోతరవేని శ్రీలతక్రాంతి మాట్లాడుతూ బోయిన్ పేట్ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తామని ఇంతటి ఘన విజయాన్ని అందించిన బోయిన్ పేట్ 6వార్డ్ ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

## సౌకర్యాల కల్పన మాది ....

# సహకరించాల్సిన భాద్యత మీది

- ప్రజలను కోరిన రామగుండం మేయర్ మహంకాళి స్వామి

**జానోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 01:**



నగర పాలక సంస్థ తరపున ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని ,ప్రజలు కూడా తమ వంతు భాధ్యతగా చెత్త బయట పడవేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు బాటలో భాగంగా బుధవారం రామగుండం నగర పాలక సంస్థ మూడవ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ , వినాయక నగర్, దొడ్డి కొమురయ్య నగర్ , శ్రీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వడ్లూరి రవి , అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. కార్పొరేటర్‌తో పాటు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ అధికారులు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి జి సి బి , చైన్ జి సి బి , బాబ్ కాట్ యంత్రాలతో పెద్ద మురుగు నీటి కాలువలో పూడిక తొలగించారు. నగర పాలక సంస్థ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ , ట్రాన్స్ కో తదితర ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి వాడ వాడలా తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. తమ ఇంటి ముందు వీధి దీపాలు వెలగడం లేదని చెప్పిన వెంటనే అప్పటికప్పుడే అక్కడిక్కడే వీధి దీపాలు పెట్టించారు. సుమారు 10 వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. తమ డివిజన్ కు మంచి నీళ్ళు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ఇండ్ల మీద వేలాడుతున్న కరెంట్ తీగలను సవరించాలని ట్రాన్స్ కో అధి, కారులకు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ది పనులు నిర్వహించడంలో అధికారులకు సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. స్థానికంగా ఉన్న హోటళ్ల నిర్వాహకులు కాలువల్లో చెత్త పడవేస్తున్నారని ఫిర్యాదు చేయగా తక్షణమే వారికి నోటీసులు అందజేసి జరిమానా విధించాలని ఆదేశించారు. రోడ్ల మీద , కాలువల్లో చెత్త వేసినా వాటిని ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర , ఇ ఇ పి వి రామన్ , డి ఇ ఇ లు అఫ్తాబ్, జగదీష్ , షాభాజ్ , ఎ ఇ లు జమీల్, మీర్, మనోజ్ , చంద్ర మౌళి , రాంజీ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు మౌనిక , కిషోర్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్‌లు నాగ భూషణం ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## జన్ విశ్వాస్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా

# లోక్‌సభలో గళమెత్తిన డాక్టర్ కడియం కావ్య

**జనోదయ, హనుమకొండ, ఏప్రిల్ 01:**

జన్ విశ్వాస్ (సవరణ) బిల్లుపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లు బాధ్యత, ప్రజా విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ చర్చలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, చిన్నచిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేయడం, వ్యాపార సౌలభ్యం పెంపు పేరుతో తీసుకొచ్చిన ఈ బిల్లు నియంత్రణ వ్యవస్థలను బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. శిక్షలను తగ్గించడం, కొన్ని నేరాలను క్రిమినల్ పరిధి నుంచి సివిల్ పరిధికి మార్చడం వల్ల అమలు యంత్రాంగం బలహీనపడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, పర్యావరణం, వినియోగదారుల హక్కులకు సంబంధించిన రంగాల్లో దీని ప్రభావం తీవ్రంగా ఉండొచ్చని పేర్కొన్నారు. శిక్షలు తగ్గించడం ద్వారా మాత్రమే ప్రజా విశ్వాసం ఏర్పడదు అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. పారదర్శక పాలన, కఠిన బాధ్యతాయుత వ్యవస్థల ద్వారానే నిజమైన నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతిపాదిత సవరణలు పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభదాయకంగా మారి, సాధారణ ప్రజల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదనంగా, బిల్లుపై విస్తృత స్థాయి చర్చలు, స్టేక్‌హోల్డర్లతో సంప్రదింపులు జరగలేదని పేర్కొంటూ, దీనిని పార్లమెంటరీ స్థాయి స్థాయీ సంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. సంస్థాగత పర్యవేక్షణకు భంగం కలిగించే అంశాలను



ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ లో తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, సమతుల్యమైన, సంప్రదింపులతో కూడిన చట్ట నిర్మాణం అవసరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## నేడు సర్దార్

## సర్వాయి పాపన్న వర్ధంతి

**జనోదయ, మంథని:**

సర్వాయి పాపన్న ఆగస్టు 18, 1650న జనగామ జిల్లాలోని (పూర్వపు వరంగల్ జిల్లా) ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించారు. ఆయన 17వ శతాబ్దంలో మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప బహుజన పోరాట యోధుడు. కుల, మత విభేదాలు లేని సమాజాన్ని నిర్మించాలని కలగన్న ఆయన, సామాన్యులను సంఘటితం చేసి తన స్వంత రాజ్యాన్ని స్థాపించారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తోంది. 2025 ఆగస్టు 18న ఆయన 375వ జయంతి వేడుకలు జరిగాయి.సర్దార్



సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2న జరుపుకుంటారు.



## మంథని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్

**జనోదయ, మంథని:**

మంథని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్‌ను మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. హాస్పిటల్ యొక్క వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌కి అధిక సంఖ్యలో పేద ప్రజలు వస్తారని వారికి అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించడం మన భాద్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు మారుపాక నిహారిక, ఎల్లంకి వంశీధర్ కాంగ్రెస్ నాయకులు వేముల సమ్మయ్య పాల్గొన్నారు.

## నేటి నుంచి పాన్ కార్డ్స్ రూల్స్ మార్పు




**జనోదయ : చెన్నూరు ఆర్సీ**

దేశంలో ఆర్థిక లావాదేవీల పారదర్శకతను పెంచే లక్ష్యంతో పాన్ కార్డుకు సంబంధించిన పలు కీలక మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. పాన్ పొందడానికి ఇకపై ఆధార్ కార్డుతో పాటు గుర్తింపు, పుట్టిన తేదీని నిర్ధారించే అదనపు పత్రాలు తప్పనిసరి. పాన్ కార్డులోని పేరు ఆధార్‌తో సరిపోలాలి. ఆర్థిక లావాదేవీల్లో రూ.10 లక్షలు దాటితే పాన్ వివరాలు అవసరం, వాహనం కొనుగోలు రూ.5 లక్షలు మించితే పాన్ తప్పనిసరి. భీమా పాలసీలకు ప్రతి పాలసీకి పాన్ తప్పనిసరి. ఆస్తి లావాదేవీల పరిమితి రూ. 20 లక్షలకు, హోటళ్లు/రెస్టారెంట్లలో నగదు చెల్లింపుల పరిమితి రూ.1 లక్షకు పెరిగింది.

## గ్రంధాలయం కొరకు భవనం పరిశీలన



**జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 01:**

గ్రంధాలయం ఏర్పాటు చేయడానికి అనువైన భవనం కొరకు విఠల్ నగర్ లోని సింగరేణి డిస్పెన్సరీ , పార్క్ ప్రక్కన గతంలో డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ విభాగం) నిర్వహించిన సింగరేణి క్వార్టర్ లను రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సశీధర్భంగా ప్రభుత్వం నుండి గ్రంధాలయం అభివృద్ధి కొరకు రూ 60.00 లక్షల నిధులు మంజూరయిన నేపధ్యంలో ఎం ఎల్‌ఎ సూచనల మేరకు అనుకూలమైన భవనం అన్వేషిస్తున్నట్లు మేయర్ తెలిపారు. విఠల్ నగర్ లో మూతపడిన సింగరేణి డిస్పెన్సరీ భవనం గ్రంధాలయం కొరకు కేటాయించాలని సింగరేణి అధికారులను కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భవనానికి మెరుగులు దిద్ది ఆధునిక డిజిటల్ లైబ్రరీ సదుపాయాన్ని పాఠకులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట కార్పొరేటర్లు ముస్తాఫా , షేక్ బాబు మియా ,నాయకులు చుక్కల శ్రీనివాస్ తో పాటు నగర పాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి. రామన్ ఉన్నారు.

# రెండు నెలలకు సరిపడా
# ముడి చమురు నిల్వలు

**... కేంద్రం**

**న్యూఢిల్లీ:** రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఎల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు (సౌదీ సీపీ బెంచ్‌మార్క్) 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల



ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలు) ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025-26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.




# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**జనోదయ, మంథని:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను నిరసిస్తూ సిఐటియు మరియు ఇతర కార్మిక సంఘాల బ్లాక్ డే పిలుపు మేరకు బుధవారం మంథనిలో నిరసన కార్యక్రమం జరిగింది. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ప్లాకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఏప్రిల్ 1 నుంచి అమలుకు సిద్ధం చేస్తున్న ఈ కోడ్లు అమలైతే కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడతారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చి, కార్మికులకు నష్టం కలిగించే ఈ విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో లేబర్ కోడ్లపై చర్చించి, రాష్ట్రంలో అమలు చేయమని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, అభ్యుదయవాదులు ఐక్యంగా గళం వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేష్, సింగారపు గట్టయ్య, రాజయ్య, పోచమ్మ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉమానాగ్ పాలిమర్స్ పై టాస్క్‌ఫోర్స్ కొరడా

**-నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అక్రమంగా తయారీ**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**

వరంగల్ నగర శివారు ఏనుమాముల మార్కెట్ సమీపంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను తయారు చేస్తున్న మరియు నిల్వ ఉంచిన 'ఉమానాగ్ పాలిమర్స్' కంపెనీపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 12,00,000/- (పన్నెండు లక్షల రూపాయల) విలువ గల నిషేధిత ప్లాస్టిక్ గ్లాసుల ఉత్పత్తులు మరియు ముడి సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ మహా నగరంలో పర్యావరణ పరిరక్షణ మరియు ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణ విషయంలో కఠినంగా వ్యవహరించాలనే నిర్ణయంతో, వరంగల్



పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ ఎ.సి.పి. మధుసూదన్ పర్యవేక్షణలో, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి బాబులాల్ తన సిబ్బందితో కలిసి తోట ప్రసాద్ నడుపుతున్న 'ఉమానాగ్ పాలిమర్స్' తయారీ మరియు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పై దాడి చేశారు. తనిఖీల్లో భాగంగా, పర్యావరణానికి అత్యంత హానికరమైన మరియు ప్రభుత్వం నిషేధించిన తక్కువ మైక్రాన్ కలిగిన ప్లాస్టిక్ గ్లాసులను భారీగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దాదాపు 12 లక్షల విలువైన స్టాక్‌ను స్వాధీనం చేసుకుని, షాప్ ఓనర్ తోట ప్రసాద్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి బాబులాల్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి ఉప్పలయ్య, ఏఎస్ఐ కె. సుధాకర్, మరియు కానిస్టేబుళ్లు మహమ్మద్ గౌస్ పాషా, అంజయ్య, శ్యాంసుందర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం-1 సిహెచ్‌పిలో సమ్మర్ మజ్జిగ పాకెట్ల పంపిణీ



**జనోదయ, మంథని(రామగిరి) :**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగరేణి సంస్థలోని ఓ సి ఎం-1 సిహెచ్‌పిలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సమ్మర్ మజ్జిగ పాకెట్లను ఉద్యోగులకు బుధవారం పంపిణీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సిహెచ్‌పి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్లకు మజ్జిగ పాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌పి డివై జీఎంలు కాశివిశ్వేశ్వర, గవ్వల శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటియుసి పిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్, ఐఎన్ టియుసి ఇంచార్జీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పోతు వెంకటేశం, సేఫ్టీ కమిటీ సభ్యులు రంగా వేణు, షిఫ్ట్ ఇంచార్జీ పొన్నాల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధ లింగయ్య, టెంపుల్ కమిటీ సభ్యులు నీర్ల రవీందర్‌తో పాటు ఏఐటియుసి, ఐఎన్ టియుసి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**జనోదయ, గీసుగొండ, ఏప్రిల్ 1:**

పేదల జీవితాల్లో వెలుగులు నింపడం, సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. బుధవారం గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో మైనాల శ్రావణ్ కుమార్ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110